క్లుప్తంగా

పేదలకు కల్యాణలక్ష్మి ఓ వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్

కాశిబుగ్గ: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు వరంగా మారాయని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబుతో కలిసి డివిజన్‌లోని 15 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, రాజేష్, పోలెపాక రవికాంత్, ఎండీ.యాసిన్, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ పట్టా అందజేత



వెంకయ్యనాయుడు నుంచి పట్టా అందుకుంటున్న సుమైయా

న్యూశాయంపేట: చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన సుమైయా తభీదీస్.. డిగ్రీ పట్టాను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈమేరకు సుమైయాను యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు కక్కెర్ల శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గాంధీయన్ ఐడియాలజీ ఇన్ ది సెలెక్ట్ నావెల్స్ ఆఫ్ రాజారావు, ముల్కరాజ్ ఆనంద్ అండ్ ఆర్‌కె నారాయణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో శ్రీనివాస్‌కు తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

కేసీఆర్ కప్.. మధుతండా కైవసం



విజేతగా నిలిచిన మధు తండా జట్టు

హసన్‌పర్తి: కేసీఆర్ క్రికెట్ కప్‌ను 65వ డివిజన్ పరిధిలోని మధు తండా కైవసం చేసుకుంది. అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగినలో పోటీల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలోని వర్ధన్నపేట, పర్వతగిరి, కాజీపేట, హసన్‌పర్తి, వరంగల్, హనుమకొండ, ఖిలా వరంగల్ పరిధిలో సుమారు 132 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌కు మధుతండా, జయగిరి జట్లు చేరాయి. అన్నాసాగరం శివారులోని మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మధు తండా విజయం సాధించింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.1.01,116, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.50,116 నగదు బహుమతి అందజేస్తామని అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ అరూరి రమేష్ తెలిపారు.

స్నేహనగర్ కమిటీ ఎన్నిక





నర్సింహారావు

హన్మకొండ: హనుమకొండ స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఖండే రావు నర్సింహారావు (చిన్న) ఎన్నికయ్యారు. హనుమకొండలోని స్నేహనగర్‌లో కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖండేరావు నర్సింహారావు నాలుగోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బి.శశికాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి.తిరుపతిరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ.చలపతిరావు, కోశాధికారిగా టి.రామబ్రహ్మం ఎన్నికయ్యారు. స్నేహనగర్ హనుమాన్ దేవాలయం కమిటీ చైర్మన్‌గా కె.వెంకట రామనర్సింహరావు, వైస్ చైర్మన్‌గా కె.బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.వాసుదేవ్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.నారాయణరెడ్డి, కోశాధికారిగా ఎన్.జగదీశ్వర్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిటీ కార్యవర్గానికి విజయ్‌భాస్కర్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఖిలా వరంగల్: సైకిల్ ర్యాలీలో గోపాల్‌రావు



హన్మకొండ కల్చరల్: మాట్లాడుతున్న సుజాత



మడికొండ: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ మరింత ముందుకు వెళ్లాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.గోపాల్‌రావు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, డీఐఓ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. స్థానికులు, సామాజిక కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది.. రామలక్ష్మణ్ గార్డెన్ నుంచి ఎస్ఆర్ఆర్‌తోట ఎస్‌బీఐ బ్యాంకు వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ యోగా, వ్యాయామం, వాకింగ్, ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రామా రాజేష్‌ఖన్నా, సీఓడీ మోహన్‌రావు, ఫార్మసిస్ట్ అంజియాదవ్, స్టాఫ్‌నర్స్ వాణి, ఏఎన్ఎం అనిత, గూడెపు ప్రభాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ మహిళ ధైర్యంతో ముందడుగు వేయాలి

హన్మకొండ కల్చరల్: ప్రతీ మహిళ ధైర్యంతో ముందడుగు వేయాలని, అణిచివేత, అవహేళనలను అధిగమించాలని ప్రముఖ కవయిత్రి డాక్టర్ బండారు సుజాత సూచించారు. తెలంగాణ రచయితల సంఘం (తెరసం) ఆధ్వర్యంలో సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బండారు సుజాత అధ్యక్షతన కవిత్వంతో కలుద్దాం కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి మాటేటి నీరజ, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పీఆర్వో కిరణ్మయి, లయన్ పద్మజదేవి మాట్లాడారు. రచయితలు స్త్రీ కోణం నుంచి రచనలు ఎక్కువగా చేయాలని అన్నారు. తెరసం జిల్లా అధ్యక్షుడు పొట్లపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బిల్ల మహేందర్, కవులు మెట్టు మురళీధర్, సిరాజుద్దీన్, రత్నమాల, వాసు, అస్నాల శ్రీనివాస్, కమలకుమారి, ధనలక్ష్మి, రాధికానరేన్ పాల్గొని కవితా పఠనం చేశారు.



మహిళా గాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మహిళా గాయకులకు సన్మానం

హన్మకొండ కల్చరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్లబ్‌లోని మహిళా గాయనీ కళాకారులను హనుమకొండ దుర్గాకాలనీలో ఏకశిల కరోకే క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమంలో క్లబ్ గాయనీ గాయకులు మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కర్నాటి ప్రమీలారాణి, సుధారాణి, రేవతి, సాగంటి మంజుల, విజయ్‌కుమార్, ప్రగల్లపాటి రాజ్‌కుమార్, నిమ్మల శ్రీనివాస్, శ్రీలత, విజయ నిర్మల, రవీంద్రనాథ్, ఉపేందర్, రవి, కిషన్ పాల్గొన్నారు.

మడికొండలో ర్యాలీ

మడికొండ: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మడికొండలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. మడికొండ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాబాయి మహిళా శిశు కేంద్రం జిల్లా అధికారి జయశ్రీ మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని డాక్టర్ ప్రీతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమారాణి, మంజుల, ప్రత్యూష, కస్తూరి, హఫీస్, కళ్యాణ్ పాల్గొన్నారు.

బాలలకు బంగారు భవిష్యత్ అందిస్తా

కాజీపేట అర్బన్: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు అభయహస్తం వర్తింపజేసి బంగారు భవిష్యత్ అందిస్తానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భరోసా ఇచ్చారు. జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సర్దార్, లక్ష్మి మృతి చెందారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం కొనసాగించే ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈక్రమంలో నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారుల సమాచారం తెలుసుకున్న చీఫ్‌విప్.. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని శిశుగృహలో వారిని చేర్పించారు. చిన్నారులకు అన్ని రకాల వసతులు కల్పించాలని జిల్లా బాలల రక్షణ అధికారి సంతోష్‌కు సూచించారు.



శిశుగృహలో చిన్నారులను చేర్పిస్తున్న చీఫ్‌విప్

నాలుగు రోజులుగా నీటి వృథా



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తి శివారులో దేవాదుల గేట్ వాల్వ్ పైకి లేస్తుండడంతో నీరు వృథాగా పోతోంది. నాలుగు రోజులుగా వాల్వ్ వద్ద నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



ఖిలా వరంగల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఎంసీపీఐ (యూ) మండల కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 37వ డివిజన్ తూరుకోటలో ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం రూ.400లు ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1176కు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించే వరకు ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాయినేని ఐలయ్య, నల్లవెలి రవి, జట్టబోయిన నరసయ్య, బాబు, కమల అరుణ, సరోజన, లక్ష్మి, స్వర్ణ, భారతి, సుధ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకుండా బీజేపీ మోసం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాదయాత్రకు స్వాగతం పలుకుతూ..

హన్మకొండ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ విమర్శించారు. మాదిగల సంగ్రామ యాత్రలో భాగంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలో గత నెల 22న ధర్మసాగర్‌లో చేపట్టిన పాదయాత్ర 12వ రోజు ఆదివారం హనుమకొండకు చేరుకుంది. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహానికి జన్ను దినేష్ మాదిగ, గద్దల సుకుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జన్ను దినేష్ మాదిగ మాట్లాడుతూ ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను దిగ్బంధం చేయడంలో భాగంగా మాదిగల మహాసంగ్రామ యాత్ర చేపట్టినట్లు వివరించారు. యాత్రకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు మాదిగ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగారపు శ్రీనివాస్ మాదిగ, పల్లె ఉదయ్ మాదిగ, ఆకారపు మురళి మాదిగ, తోట శ్రీనివాస్ మాదిగ, బండారి కుమారస్వామి మాదిగ, బొడ్డు శాంతిసాగర్, శనిగరపు రవీందర్ మాదిగ, రవికుమార్, కొట్టె కళ్యాణ్ మాదిగ, సదిరం రాజు మాదిగ పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ

కాజీపేట: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా ఎస్సీ వర్గీకరణ జీఓకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ నాయకులు నేడు ఆ ఊసే మరిచిపోయారని, మాదిగలను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ విమర్శించారు. మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చేపట్టిన మహా సంగ్రామ పాదయాత్ర కాజీపేట పట్టణానికి ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంద రాజు, కుమ్మరి రాజయ్య, గంగారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకం

దామెర : ప్రతిఒక్కరి జీవితంలోనూ విద్యార్థి దశ చాలా కీలకమని డిస్నీల్యాండ్ హైస్కూల్ ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య స్పష్టం చేశారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని ఆ స్కూల్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి ముఖ్యమని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య, ఉపాధ్యాయుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని సూచించారు. వార్షిక పరీక్షల పట్ల ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని తేటతెల్లం చేశారు. ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. పదో తరగతిలోనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. అనంతరం పాఠశాల సలహాదారు లక్ష్మీనివాస్, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్ భాను, దినేష్ చందర్, పవన్, భానుచందర్, కావ్య, మీన, రచన, శ్రీలత మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సదయ్య, తదితరులు

సంక్షిప్తంగా

మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంక్ శుభ్రం



వరంగల్ చౌరస్తా: వరంగల్ 2వ డివిజన్ దయానంద కాలనీ కమిటీ ఆదివారం సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. కాలనీలోని 32 గృహాలకు సంబంధించిన సెప్టిక్ ట్యాంక్‌లను ప్రతి మూడేళ్లకోమారు విధిగా శుభ్రం చేసుకోవాలని తీర్మానం చేసుకున్నారు. దయానంద కాలనీ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో మ్యారి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మండల పరశురాములు, కాలనీ ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ట్రెజరీ జి.రవికుమార్, వెంకటేశ్వర్లు, రాజారాం, సహజాద్, వసుంధర, శారద, రమాదేవి, హేమాంగని, అస్కీ, పౌర సంఘాల వేదిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో అనఘాష్టమి వ్రతపూజను ఆదివారం సాయంత్రం నేతపర్వంగా నిర్వహించారు. ఆలయ పూజారి వెంకటేశ్వర చార్యులు, వేదపండితుడు రాజేంద్రప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వ్రతం చేశారు. కార్యక్రమంలో నరేందర్, మంచాల కృష్ణమూర్తి, శ్రీరామ్‌రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



హసన్‌పర్తి: విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హసన్‌పర్తి మండలం ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మోటివేటర్ సంద్ర సుధీర్‌కుమార్ హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలో ఉందని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి, మండల విద్యాశాఖ అధికారి రాంకిషన్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

హసన్‌పర్తి: ఇంటర్ స్టేట్ ఓపెన్ మార్షల్ చాంపియన్ – 2023లో ప్రతిభ కనబరిచిన హసన్‌పర్తి మండలం ఎల్లాపురానికి చెందిన క్రీడాకారులు రన్వి, రిషిత, ప్రజ్ఞ, వి.సాయి హర్షిణి, మహేందర్‌రెడ్డి, పర్వేజ్‌ను ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వరంగల్ చౌరస్తా: వరంగల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పిన్నావారి వీధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీకర ఆస్పత్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుంటూరు వెంకట నారాయణ, సెక్రటరీ పల్లెర్ల వీరన్న, కోశాధికారి గన్ను సంపత్ కుమార్, పిన్నా ఈశ్వర్ కుమార్, గుముడవెల్లి సురేష్, గుమువెల్లి సత్యనారాయణ, గాదె వాసుదేవ్, ఐతా ప్రేమ్‌నాథ్, తోట మార్కండేయ, గోవిందరాజులు, చిదరాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

ఎల్కతుర్తి : క్రీడలు మానసిక వికాసానికి బాటలు వేస్తాయని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ తెలిపారు. సూరారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహ్మద్ ఖాన్ మెమోరియల్ ఇంటర్ జోనల్ కండిస్టిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు.

రక్షణ చట్టాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: వినియోగదారుల రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని జాతీయ కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సీసీసీ (సౌత్ స్టేట్స్) ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో మురహరి కార్తీక్ అధ్యక్షతన పలు జిల్లాల వినియోగదారుల ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ ఈనెల 15న వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సూచించారు. వినియోగదారుల రక్షణకు 49 చట్టాలు ఏర్పడ్డాయని, ఆయా ప్రాంతాలను బట్టి అవి పని చేస్తాయని చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం 1986, 2019లలో సవరణ చేయబడ్డాయని వివరించారు. నువ్వు వినియోగదారుడివే – ఇది నీ చట్టం అనే వ్యాఖ్యానాన్ని ఉమ్మడి 10 జిల్లా కేంద్రాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో సీఐసీడబ్ల్యూ సీ అధ్యక్షులు కరుణాకర్, ఆర్.సురేష్, డిస్ట్రిక్ట్ లీగల్ ఎయిడ్ డీన్ రజని, న్యాయ సలహా మండలి సభ్యులు న్యాయవాదులు మురారిశెట్టి యశ్వంత్‌కుమార్, మట్టెవాడ విజయ్‌కుమార్, రంగరాజు, ఆనందరావు, రాయభారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, డాక్టర్ వీరస్వామి, శశికాంత్, రాజేష్, రమేష్, శ్యామల, భవాని, నవీన్‌కుమార్, అల్లాడి వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీని పకడ్బందీగా అరికట్టాలి

హన్మకొండ చౌరస్తా: ఆహార కల్తీని పకడ్బందీగా అరికట్టి, ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించనప్పుడే వ్యాపారంలో రాణిస్తారని వ్యాపారస్తులకు రిటైర్డ్ ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్ కృష్ణమూర్తి సూచించారు. కాయ్ వింజిబాబా గ్రామీణ్ వికాస్ మండల్ (కేవీజీవీఎం) ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రైవేట్ హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శిక్షణ తరగతులకు సుమారు 40 మంది హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు, ఐస్‌క్రీం పార్లర్ల వ్యాపారస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆహార పదార్థాల తయారీ, అడ్వాన్స్‌డ్ కేటరింగ్, ఫుడ్ సేఫ్టీలో మెలుకువలు, నాణ్యత ప్రమాణాల అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. అనంతరం వ్యాపారస్తులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీజీవీఎం రాష్ట్ర ఇన్‌చార్జ్ సింధు, మోహన్‌బాబు, రాష్ట్ర కోఆర్డినేటర్లు కేశవర్ధన్ రెడ్డి, హరికృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వ్యాపారస్తులతో నిర్వాహకులు

రైతాంగ సమస్యలపై పోరాటం

హన్మకొండ: రైతాంగ సమస్యలపై భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడమటి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి రైతులను ఆగం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.లక్ష రుణం మాఫీ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. తాజాగా మాట తప్పారని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని పాలకులు చెప్పుతున్న మాటలు జూటా మాటలని తేలిపోయిందన్నారు. ఈ క్రమంలో రైతుల సమస్యలపై కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 10న మండల కేంద్రాల్లో రైతు దీక్షలు చేపట్టాలని సూచించారు. కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో చేపట్టే దీక్షలను విజయవంతం చేయాలని బీజేపీ, కిసాన్‌మోర్చా నాయకులు, కార్యకర్తలు, రైతులను కోరారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గండు సారయ్య, గౌర్ల కాపర్ల సంఘం అధ్యక్షులు ముస్కు వెంకటేష్, కిసాన్ మోర్చా కార్యదర్శులు సామల మధుకుమార్, రాములు, నాయకులు కటకం రాజేష్, అశోక్, పి.సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న హరికృష్ణ

ఖిలా వరంగల్: రాజ్యాంగ విలువలను కాపాడుతూ, మతోన్మాదులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి టీ.హరికృష్ణ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో స్వేచ్ఛ వరంగల్ జాయింట్ కమిటీ బాలరాజు అధ్యక్షతన సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ శతాబ్దాలుగా ప్రజల పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని వాపోయారు. అందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలే కారణమని విమర్శించారు. ఈనెల 10న సావిత్రిబాయి పూలే వర్ధంతి, 20న జరగనున్న స్వేచ్ఛ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ మెడికల్ కళాశాల విద్యార్థిని డాక్టర్ ప్రీతి అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నాస్తిక సంఘం నాయకుడు బైరి నరేష్‌పై దాడి చేసిన వారిపై తక్షణమే విచారణ జరిపి శిక్షించాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరూరి కుమార్, బి.రమాదేవి, జిల్లా కార్యదర్శి మేకల రవి, నలిగంటి రత్నమాల, దండు లక్ష్మణ్, నర్రా ప్రతాప్, రాజు, భాస్కర్, శ్రీనివాస్, కుమార్, గంగుల దయాకర్, చిర్ర సూరి, వీరగోని శంకరయ్య, భవాని, పాషా, దస్రు గోవిందరావు, మైదం పాని, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 –95 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాంనర్సింహచార్యులు మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఓదెల నరేందర్, చెన్నూరి రవిచంద్ర, సురేందర్, రామకృష్ణ, పెద్దమ్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు

సీవీ.రామన్ హై స్కూల్‌లో..

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని సీవీ.రామన్ హై స్కూల్ 1997 –1998వ పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండ నక్కలగుట్టలోని ల్యాండ్‌మార్క్ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పరస్పరం ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాఠశాలలోని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు టి.వి.సుజాత, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, సురేందర్, లక్ష్మీనారాయణ, వీరబ్రహ్మం, లలిత, రవీందర్ పాల్గొన్నారు.



సీవీ.రామన్ స్కూల్ పూర్వ విద్యార్థులు